క్లుప్తంగా

ఆత్మకూరు డివిజన్‌లో 120.8 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: బుధవారం ఉదయం వరకు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 120.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం అధికారులు తెలిపారు. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 37.2 మి.మీ. మర్రిపాడులో 26.4, ఏఎస్‌పేట 22.2, సంగం 13.2, అనంతసాగరం 8.6, ఉదయగిరి 5.2, చేజర్ల 4.2, సీతారామపురం 2.8, కలువాయిలో 1 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం శుక్రవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో తిరుగుతున్న బస్సు సౌకర్యాలు, లాజిస్టిక్ సేవలపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు, తెలియజేయాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో ఇబ్బందులు ఉన్నా సౌకర్యాలు మెరుగు పరుచుకునేందుకు సలహాలు, సూచనలు చేయడానికి 99592 25995 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి తక్షణ సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్లకు చెందిన దేవరకొండ వెంకటేశ్వరరావు బుధవారం మృతి చెందాడు. అతని కుటుంబానికి వైఎస్సార్ ఆసరా తక్షణ సాయం కింద రూ.10 వేలు స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వరికుంటపాడు: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 14 గ్రామ వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. 10న ఇంటర్వ్యూ నిర్వహించి 13న పోస్టింగ్స్ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

వరికుంటపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అమలు చేస్తున్నదని మండల వైద్యాధికారిణి కరిష్మా అన్నారు. ఆమె బుధవారం మండలంలోని రామాపురంలో 104 వాహన సేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలందించారు. 55 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీర్ఘకాలిక రోగులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరానికి రాలేని వారికి ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మేరీస్టెల్లా, పవన్, సరిత, ఖాదర్‌బీ, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ



ఆత్మకూరురూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మండలంలోని వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. మొత్తం 32 మంది విద్యార్థులకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ దిసించర్ల సునంద, హెచ్‌ఎం కలిశెట్టి రవీంద్రకుమార్ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు జీవని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్ల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న శ్రీనివాసులునాయుడు, మాధవరెడ్డి తదితరులు

మర్రిపాడు: మర్రిపాడు ఎస్సీ, బీసీ మిక్స్‌డ్ కాలనీల్లో సీసీ రోడ్లను నిర్మించేందుకు రోడ్లను వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయా కాలనీల్లో స్థానికులు తమ దృష్టికి తీసుకు వచ్చిన రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరగా ప్రారంభించుకుని పూర్తి చేసుకోవాలన్నారు.

అదనులోనే పొలాలకు పదును

- సాగుకు సమాయత్తమవుతున్న పొగాకు రైతు
- ఇదే తగిన సమయం అంటున్న అధికారులు



పొలంలో పొగాకు నాటుతున్న కూలీలు

మర్రిపాడు: మండలంలో ప్రధాన వాణిజ్య పంట పొగాకు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత నెల రోజులుగా వర్షాల కోసం ఎదురు చూసిన రైతాంగానికి రెండు.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొగాకు పంట వేసేందుకు తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. నవంబర్ వరకు ఆశగా ఎదురుగా చూసిన రైతాంగానికి తొలి వారంలోనే వర్షాలు జోరుగా కురవడంతో గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పొగాకు నారు అమ్మకాలు జోరును పెంచారు. మడుల్లో నారు ఎక్కడ ఎండిపోతుందోనన్న ఆందోళన చెందిన రైతన్నలకు తొలకరి జల్లుతో పాటు మోస్తారు వర్షాలు పడుతున్నాయి. డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలో 2,128 మంది రైతులు 1721 బ్యారెన్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 20 శాతం మేర నాట్లు వేసిన రైతులు వర్షాలు పడుతుండడంతో రెండు.. మూడు రోజులుగా నాట్లు ఊపందుకున్నాయి. గత రెండేళ్లుగా ఆశాజనకంగా పొగాకు రైతులకు ధరలు లభిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా మంచే జరుగుతుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 500 హెక్టార్లలో పొగాకు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు అధికారులు తెలిపారు. 1512 బ్యారెన్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారని వివరించారు. ఈ వర్షాలు ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే పొగాకు పంట సాగుకు ఇదే మంచి అదునుగా మారనుందని రైతులు తెలుపుతూ నాణ్యమైన పొగాకును పండిస్తామని ఆనందంగా చెబుతున్నారు.



పొగాకు నాటిన పొలం

సాగుకు సిద్ధం చేస్తున్నాం



వర్షాలు కురిసి భూమి పదునులోకి వచ్చింది. దీంతో మాకున్న పొలంలో పొగాకు నాటేందుకు సమాయత్తమవుతున్నాం. గత రెండు సంవత్సరాల నుంచి పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ దఫా కూడా అదే తరహాలో మంచి జరుగుతుందని ఆశిస్తున్నాం.

– ఉర్లగంటి శ్రీనివాసులరెడ్డి, పొగాకు రైతు, పొంగూరు

నాట్లకు సరైన సమయం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నాట్లు వేసేందుకు సరైన సమయం. ఈ సమయంలో నాట్లు వేస్తే నాణ్యమైన పొగాకు లభిస్తుంది. బోర్డు పరిధిలోని 10 మండలాల్లో రైతులు సాగుకు సమాయత్తమయ్యారని మా దృష్టికి వచ్చింది. పొగాకు ధరలు స్థిరంగా ఉండవు కాబట్టి రైతులు ప్రత్యామ్నాయ పంట వైపు కూడా దృష్టి సారించాలి.

– రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు బోర్డు

నేటి నుంచి 'ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి'



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం నుంచి 'ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి' అనే కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నెల 23వ తేదీ వరకు మొదటి విడతగా ప్రతి మండలంలో ఎంపిక చేసిన సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమం జరిగే సచివాలయాల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరిస్తారు. ప్రభుత్వ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు వలంటీర్లు, పార్టీ అభిమానులు, మద్దతుదారుల సమక్షంలో సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్య వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, సొసైటీ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొంటారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గ్రామ నాయకులతో రాత్రి భోజనం చేస్తారు. ఇందుకోసం ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నాయకులు ఒకే చోటుకు చేరేలా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు కలిసికట్టుగా ఇంటింటా ప్రచారం నిర్వహించి ఎందుకు ఆంధ్రకు జగనే కావాలని అంశంపై ఆయా కుటుంబాల వారికి వివరిస్తారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో..

తొలి విడతగా ప్రారంభమవుతున్న 'ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏడు సచివాలయాల పరిధిలో గురువారం కార్యక్రమం నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. మర్రిపాడు మండలం మర్రిపాడు, అనంతసాగరంలో అనంతసాగరం బిట్-1, ఆత్మకూరు మండలంలో బట్టేపాడు, ఆత్మకూరు పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం, అనుమసముద్రంపేట లో అనుమసముద్రం, సంగంలో సంగం-1, చేజర్ల మండలంలో చేజర్ల సచివాలయంలలో కార్యక్రమాలు ఏకకాలంలో ప్రారంభించేలా ఏర్పాటు చేశారు.

'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' జయప్రదం చేయండి

ఆత్మకూరు: సంక్షేమ పథకాల సృష్టికర్త, అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్లకే చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి సీఎం కావాలని నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాల వ్యవధిలో వందలాది సంక్షేమ పథకాలను, కోట్లాది మంది లబ్దిదారులకు అందజేసిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. పలు రాష్ట్రాలు సీఎం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను తమ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నాయంటే ముఖ్యమంత్రి గొప్పతనం అర్థమవుతోందన్నారు. తాను చేసిన పనులు సంక్షేమాలను చూసి ఆశీర్వదించి తిరిగి సీఎంగా అవకాశం ఇవ్వాలని జగనన్న కోరుతున్నారంటే రాజకీయాల్లో సరికొత్త ఒరవడిని సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయాల్లో వరసగా గురువారం నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, అధికారులు, పార్టీ నాయకులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, డాక్టర్ జే ప్రణీత్, కేతా రవి, కౌన్సిలర్లు షేక్ మహబూబ్‌బాషా, ఎం.రాజశేఖర్, షేక్ రహీం, రిజ్వాన్, కొప్పోలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాగు పోరంబోకు స్థలాల పరిశీలన



వాగుపోరంబోకు స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తదితరులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నెల్లూరు-ముంబయి రహదారికి సమీపంలో చేనేత కాలనీ, టిడ్కో గృహాలకు వెనుక వైపునే ఉన్న వాగు పోరంబోకే స్థలాలను ఇటీవల పలువురు ఆక్రమిస్తుండడంతో ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని సర్వే 581లో ఉన్న వాగు పోరంబోకు స్థలాలను పలువురు ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడం, పలువురు ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె రికార్డులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో కబ్జాలను పరిశీలించారు. వీటిపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. విలువైన ఈ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల సమన్వయంతో వాగు పోరంబోకు స్థలాలను సంరక్షిస్తామన్నారు. ఆమె వెంట తహసీల్దారు జగదీష్ బాబు, డిప్యూటీ తహసీల్దారు, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

- రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీఓ సమావేశం



రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల తొలగింపు అన్ని విధాలుగా పరిశీలించిన అనంతరమే చేసేలా సిబ్బందిని ఆదేశించామన్నారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ కోసం 7వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు ఫారాలు పూర్తి చేసి అందజేశారని పరిశీలన జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఓటర్ల నమోదుతో పాటు తొలగింపు ఓట్లను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల తహసీల్దార్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు నందా ఓబులేసు, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, వెంకటయ్య, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

ఆత్మకూరు: ఏఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన వల్లెపు రవీంద్ర (34) ఆత్మకూరు మండలం బండారుపల్లి శివారు పొలాల వద్ద అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం పడి ఉన్న తీరు, మృతుడిపై ఉన్న గాయాలు, ఇతర ప్రాథమిక ఆధారాలతో రవీంద్రది హత్యగా నిర్ధారించారు. ఈ మేరకు ఆత్మకూరు సీఐ జి.వేణు, ఎస్సై ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. అందులో భాగంగా ఇప్పటికే ఆత్మకూరుకు చెందిన ముగ్గురు, తాతిరెడ్డిపల్లికి చెందిన ఒకరు మొత్తం నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మీమాధవి

అల్లూరు: రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు పనులు ప్రారంభించాలని ఏడీఏ జి లక్ష్మీమాధవి తెలియజేశారు. బుధవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో అల్లూరు, బీరంగుంట, పురిణి గ్రామాల్లో రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో త్వరపడి నారుమళ్లను పోసుకోవద్దన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన నువ్వు, పెసర పంటల సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట పైర్లు పెంచడం ద్వారా భూమిని సారవంతం చేయవచ్చని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమిని దున్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో నాటడానికి అనువైన వరి రకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓలు చక్రవర్తి, మధురిమ, వి.అశోక్, వీఏఏలు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి



సంగం: దీపావళి సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని సంగం సీఐ రవినాయక్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసుల దుకాణాల్లో అగ్నిమాపకశాఖ సూచించిన నియమ నిబంధనలను పాటించాలన్నారు. ప్రజలు టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

బోరు నిర్మాణానికి పూజ



ఉదయగిరి: పట్టణంలోని యాదవ వీధిలో జెడ్పీ నిధులతో బుధవారం మంచినీటి బోరు నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానికంగా మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ మోది రామాంజనేయులును కోరగా జెడ్పీ నుంచి నిధులు మంజూరు చేయించారని పంచాయతీ సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, 13వ వార్డు సభ్యుడు ఉప్పుటూరి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్దమస్తానీ ఎస్థానీ, జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబరు గడియాల్చి ఎస్థానీ, ఎంఏ రియాజ్, షేక్ ఎస్థానీ, కె.పెంచలయ్య, లాడెన్, సుభానీ, కె.సురేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- కేంద్రం వైఖరికి నిరసనగా విద్యా సంస్థల బంద్



ఆత్మకూరు: పాఠశాల ఎదుట నిరసన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టం మేరకు ఇవ్వాల్సిన పరిశ్రమలు, ఉద్యోగాలు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు కష్టపడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ, తదితర ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా విద్యార్థి సంఘాల జేఏసీ బుధవారం పాఠశాలల బంద్ నిర్వహించింది. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసి వేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఎస్‌ఐఎఫ్, తదితర విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. 36 మంది విద్యార్థులు, యువత ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని అలాంటి చారిత్రాత్మక పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం మారుమోగుతుందని, ఇది కేంద్రానికి వినబడడం లేదా అని విద్యార్థి నాయకులు ప్రశ్నించారు. వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమకు ఖనిజ గనులను ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఖాదర్ బాషా, చక్రి, ఎస్థానీ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

సోమశిల: ఎందరో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి షేక్ ఆరీఫ్ అన్నారు. అనంతసాగరంలో బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మున్వార్, కోటి, సూర్య, దశతి, భద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ తూమాటి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎంపీపీ, నాయకులు

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుపల్లి సచివాలయ పరిధిలోని తూర్పుపల్లి, పెళ్లేరు, రెడ్డివారికండ్రిక గ్రామాల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలు మేరకు ఎంపీపీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరికి ఉపయోగపడే విధంగా గ్రామంలోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. రైతులు గ్రామంలోనే తమకు అవసరమైన వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఉపకరణాలు పొందేలా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సుపరి పాలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరి అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రెడ్డివారికండ్రికలో తాగు నీటి అవసరాల కోసం ఎమ్మెల్యే సహకారంతో బోర్లు ఏర్పాటు చేసి తాగు నీరు అందిస్తామని వివరించారు. వీధిలైట్లు లేవని గ్రామస్తులు తెలుపగా ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జి.కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొమ్మి సిద్దులనాయుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు తమ్మినేని తిరుపతినాయుడు, నాయకులు గువ్వల బాలయ్య ఆళ్ల చిన్నయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరత్నమ్మ, గణేష్, సెక్రటరీ శీనయ్య పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఆత్మకూరు ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నేతలు

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారిణిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కురబ మధులతను పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఆత్మకూరు ప్రశాంతమైన డివిజన్ కేంద్రమని, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపి రైతులకు సహాయం చేయాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కె.కిషోర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీల్లో రూ.4,29,98,239లతో 644 పనులకు సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసింది. ఈ మేరకు మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహించి, ఆయా పనులపై వచ్చిన అభ్యంతరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి సుజాత, ఏపీడీ మృదుల, ఏపీఓ పెన్షన్ సత్యనారాయణ, ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తి కలిగేలా బోధించాలి

- స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అవగాహన



ప్రవీణ్ ప్రకాష్ సందేశాన్ని వీక్షిస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు

ఆత్మకూరు: ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యపై ఆసక్తి కలిగేలా బోధించాలని ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా విద్యార్థులు కృషి చేయాలని ఆత్మకూరు ఎంఈఓ షేక్ నజీర్‌బాషా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ పరిధిలోని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాభ్యాసం పటిష్టత అంశంపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యాభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పలు అంశాలను అవగాహన పెంచుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాభివృద్ధికి పలు అంశాలను వివరిస్తున్న వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 చలపతితో పాటు పలు మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ గౌస్ అహమ్మద్, పలువురు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ

వరికుంటపాడు: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ గువదగట్ల వెంకటలక్ష్మమ్మ కోరారు. ఆమె బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన మండల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తెస్తానన్నారు. మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బోర్లకు అవసరమైన విడిభాగాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ చంచల మధు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి జీఎంకే ట్రస్ట్ విరాళం

ఉదయగిరి: వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ ఆలయానికి ఉదయగిరి మండల వైస్ ఎంపీపీ, జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి బుధవారం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ నిర్వాహకులు గుంటుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బి.వెంకటేశ్వర్లు, షేక్ గఫూర్, గౌసు, మహేష్, పాముల రాజా. జి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.